క్లుప్తంగా

తాట్‌పల్లిలో గ్రాడ్యుయేషన్ డే

మునిపల్లి(అందోల్): మండలంలోని తాట్‌పల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం గ్రాడ్యుయేషన్‌డే నిర్వహించారు. ఈ సంవత్సరం చదువులు పూర్తయిన పిల్లలకు పట్టాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో పాటు అన్ని సౌకర్యాలు ఉన్నాయన్నారు. విద్యార్థులకు డిజిటల్ తరగతులను తీసుకోవడం జరుగుతుందన్నారు. తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ బడికి పంపాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను దూషించిన వ్యక్తిపై చర్యలు తీసుకోండి

సంగారెడ్డి: అంబేడ్కర్‌ను అవమానించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేశారు. శనివారం పుల్‌కల్ ఎస్‌ఐ క్రాంతికుమార్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. చౌటకూర్ మండలం, వెండికోల్ గ్రామానికి చెందిన సాయిరాం అనే వ్యక్తి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను సోషల్ మీడియా ద్వారా అవమానించారని, అతనిపై చట్టరీత్యా కేసు నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యూత్ అధ్యక్షుడు కుమార్, రాకేశ్, ప్రశాంత్, వినోద్ కుమార్, వీరేశం, నరేశ్ ఉన్నారు.

లబ్ధిదారుల ఎంపిక

కంగ్టి(నారాయణఖేడ్): ఇందిరమ్మ కమిటీ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు ఎంపీడీఓ సత్తయ్య పేర్కొన్నారు. శనివారం మండలంలోని తడ్కల్, ముర్కుంజాల్, దామర్‌గిద్దా, బాన్సువాడ, చౌకన్‌పల్లి, సుక్కల్‌తీర్థ్, గాజుల్‌పాడ్, రాజారాం తండా, ఘన్‌పూర్, నాగుర్(కే) గ్రామ పంచాయతీల్లో ఇందిరమ్మ ఇళ్ల కోసం సంబంధిత స్పెషల్ ఆఫీసర్ల ఆధ్వర్యంలో ఎంపిక చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ నూతన్‌కుమార్, తహసీల్దార్ భాస్కర్, ఎంపీడీఓ సత్తయ్య పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

జడ్జికి సన్మానం



జడ్జి సూరికృష్ణను సన్మానిస్తున్న గోపాల్

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ కోర్టు సీనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న కె.సూరికృష్ణను శనివారం న్యాయవాదులు సన్మానించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోపాల్, కార్యవర్గ సభ్యులు ఆయనను శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన ఉత్తమ సేవలు అందించారని కొనియాడారు. సూరికృష్ణ స్థానంలో గద్వాల్ నుంచి జడ్జి ఘంటా కవితాదేవి బదిలీపై జహీరాబాద్‌కు వస్తున్న విషయం తెలిసిందే.

కొండెంగకు చికిత్స

పటాన్ చెరు టౌన్: ద్విచక్ర వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడిన కొండెంగకు చికిత్స అందించి అటవీశాఖ అధికారులకు అప్పజెప్పిన ఘటన శనివారం పటాన్‌చెరు పరిధిలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. పటాన్‌చెరు జాతీయ రహదారిని కొండెంగ దాటుతుండగా గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడి రహదారి పక్కనే పడిపోయింది. గమనించిన స్థానికులు పటాన్‌చెరు వెటర్నరీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స అనంతరం అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు రావడం ఆలస్యం అవుతుండటంతో సంగారెడ్డి జిల్లా అటవీశాఖ అధికారులకు అప్పజెప్పారు.

ప్రత్యేక పూజలు



పూరీ జగన్నాథుడిని దర్శించుకున్న అంజిరెడ్డి దంపతులు

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ లోని పూరీ జగన్నాథ ఆలయంలో బీజేపీ ఎమ్మెల్సీ అంజిరెడ్డి దంపతులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పూరీ జగన్నాథుడి ఆశీస్సులు ప్రజలపై ఉండాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్సీ దంపతులను స్థానిక నాయకులు ఆనంద్ కృష్ణారెడ్డి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బొల్లారం మున్సిపల్ బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

పటాన్‌చెరు టౌన్: కిష్టారెడ్డి పేట సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం ఉ. 10 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందని ఏఈ రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆదాయం మున్సిపాలిటీకి.. కష్టాలు కరెంటోళ్లకి

- హోర్డింగ్‌లతో తప్పనితిప్పలు
- ఇష్టానుసారంగా అనుమతులు
- వర్షం ఈదురుగాలులుకు ప్రమాదాలు



విద్యుత్ తీగలపై పడిన రేకులను తొలగిస్తున్న సిబ్బంది



విద్యుత్ తీగలపై పడిన ఫ్లెక్సీ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. నిర్మాణ సంస్థలు ప్రకటనలకు ఇక్కడ డిమాండ్ ఎక్కువ ఉండటంతో తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన రహదారులను ఆనుకుని జోరుగా హోర్డింగ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. వీటి వల్ల మున్సిపాలిటీకి ఆదాయం సమకూరుతోంది. కాని విద్యుత్‌శాఖ అధికారులకు హోర్డింగులతో తలనొప్పిగా మారింది. తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో రెడియల్ రోడ్డును ఆనుకుని మున్సిపల్ అధికారులు ఇష్టానుసారంగా హోర్డింగ్‌లకు అనుమతులు ఇస్తున్నారు. చిన్నపాటి గాలులకు హోర్డింగ్‌లపై అమర్చిన ఫ్లెక్సీలు తేగి వాటికి అనుకుని ఉన్న 11కేవీ విద్యుత్ తీగలపై పడుతున్నాయి. దాని కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుంది. వీటి వల్ల విద్యుత్‌శాఖ అధికారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఎక్కువ శాతం హోర్డింగ్‌లు 11కేవి విద్యుత్ తీగలకు ఆనుకునే ఉన్నాయి. ఈదురు గాలులు సమయంలో పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. విద్యుత్ తీగలపై ఫ్లెక్సీలు పడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. ఆసమయంలో వెంటనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని విద్యుత్ శాఖ పైఅధికారులతో పాటు ప్రజలు స్థానిక విద్యుత్‌శాఖ అధికారులపై ఒత్తిడి తీసుకొని వస్తున్నారు. దీంతో అధికారులు వర్షంలోనే తిరిగి వాటిని గుర్తించి ప్రమాదకరంగా క్రేన్‌కు ఒక బెల్టును అమర్చి దానిపై కూర్చొని ఫ్లెక్సీలను తొలగిస్తున్నారు. హోర్డింగ్‌ల ద్వారా ఆదాయం పొందుతున్న మున్సిపల్ అధికారులు కనీసం ఇలాంటి సమయంలో బాక్స్ క్రేన్‌ను కూడా ఏర్పాటు చేయడంతోని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హోర్డింగ్‌లకు అనుమతులు ఇచ్చే సమయంలో విద్యుత్ తీగలకు దూరంగా ఇస్తే ఇలాంటి సమస్యలు రావని విద్యుత్‌శాఖ అధికారులు వాపోతున్నారు. హోర్డింగ్‌ల వల్ల మున్సిపల్‌కు ఆదాయం, కరెంటోళ్లకు కష్టాలు వస్తున్నాయని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఇష్టానుసారంగా అనుమతులు

తెల్లాపూర్‌లో హోర్డింగ్‌లకు ఇష్టానుసారంగా అనుమతులు ఇస్తున్నారు. చిన్నగాలి వస్తే చాలు ఫ్లెక్సీలు తేగి విద్యుత్ తీగలపై పడుతున్నాయి. విద్యుత్ సరఫరాకు ఆటంకం ఏర్పడుతుంది. హోర్డింగ్‌ల అనుమతులపై ఉన్నతాధికారులు ఆరా తీసి చర్యలు తీసుకోవాలి. ఫ్లెక్సీలు వాహనదారులపై పడితే ప్రమాదం జరిగే అవకాశం ఉంటుంది.



– సురేష్, తెల్లాపూర్

పైఅధికారుల దృష్టికి తీసుకెళ్లాం

ఎక్కువ గాలి వీచినప్పుడు హోర్డింగ్‌లకు ఉన్న ఫ్లెక్సీలు 11కేవి తీగలపై పడుతున్నాయి. వాటిని గుర్తించి వెంటనే తొలగిస్తున్నాం. ఈ విషయంలో హోర్డింగ్‌దారులకు నోటీసులు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నాం. ఈ సమస్యలను పైఅధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగింది.

– శివశంకర్, ఏఈ విద్యుత్‌శాఖ

యువ వికాసానికి భారీ స్పందన

మండలంలో 1,149 దరఖాస్తులు

కంది(సంగారెడ్డి): స్వయం ఉపాధి పథకాలు చేపట్టేందుకు నిరుద్యోగ యువతకు రుణాలను అందించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాస్ పథకం కోసం కంది మండలంలో భారీ స్పందన లభించింది. పలుమార్లు సర్వర్ డౌన్ సమస్యలు తలెత్తినా మీ సేవ కేంద్రాల వద్ద లైన్లు కట్టి యువకులు భారీగా దరఖాస్తులు చేసుకున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ నిరుద్యోగులకు ప్రభుత్వం సబ్సిడీతో కూడిన రుణాలను నేరుగా బ్యాంకుల ద్వారా అందించనుంది. ఈ దరఖాస్తులను ఈ నెల 5నుంచి 14 వరకు స్వీకరించారు. మొత్తం దరఖాస్తులు1149 వచ్చినట్లు అధికారులు తెలిపారు. అయితే ఏ యూనిట్‌కు ఎంత సబ్సిడీ వస్తుందో తెలియక పోవడంతో చాలా మంది దరఖాస్తు చేసుకునేందుకు ముందుకు రాలేదు. దరఖాస్తులు చేసుకునేందుకు గడువును ఈనెల 24 వరకు పెంచినట్లు కొందరు చెబుతున్నా అధికారిక ప్రకటన రాలేదని ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. గడువు పెరిగితే మరిన్ని దరఖాస్తులు వచ్చే అవకాశం ఉంది.

ఉద్యోగులకు పదవీ విరమణ సహజం

నోడల్ అధికారి డీసీఈబీ జిల్లా కార్యదర్శి లింబాజీ



మహమ్మద్ హుస్సేన్ దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

సదాశివపేట(సంగారెడ్డి): ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ సహజమేనని నోడల్ అధికారి డీసీఈబీ జిల్లా కార్యదర్శి లింబాజీ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని నూతన ప్రభుత్వ ఉన్నత పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు మహమ్మద్ హుస్సేన్ ఉద్యోగ విరమణ సందర్భంగా వీడ్కోలు సమావేశం ప్రధానోపాధ్యాయుడు రవీంద్రనాథ్ అధ్యక్షతన నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ... ఉద్యోగ నిర్వహణలో వారు చేసిన సేవలే గుర్తింపునిస్తాయన్నారు. పదవి విరమణ పొందిన మహమ్మద్ హుస్సేన్ దంపతులను తోటి ఉపాధ్యాయులు ఘనంగా వీడ్కోలు పలికి బంగారు ఉంగరం బహూకరించి శాలువాతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో ఎంఈఓ శంకర్, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు సాబీర్‌అలీ, జీటీఏ జిల్లా అధ్యక్షుడు అనంతరామ్, ఉపాధ్యాయులు ఉమారాణి, షహనాజ్ ఫాతిమా, జ్యోతి అపరంజని, లక్ష్మారెడ్డి, నిజామొద్దీన్, సంగమేశ్వర్, రవికుమార్, షేక్ అహ్మద్‌అలీ, వినోద్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు తలెత్తొద్దు

టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలారెడ్డి



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన నిర్మలారెడ్డి


సంగారెడ్డి టౌన్ : కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని తాళ్లపల్లిలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ కలిసి ఆమెఎ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు పండించిన చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులందరికీ అండగా ఉంటుందని ప్రతి రైతుకు న్యాయం జరిగేలా చూస్తుందన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు, మాజీ ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రజతోత్సవ సభ విజయవంతం చేయండి

బీఆర్ఎస్ నాయకుడు ఆదర్శ్‌రెడ్డి

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలం, గడ్డపోతారం, బొల్లారం మున్సిపాలిటీల బీఆర్ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశం శనివారం గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని పులిగిల్ల ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదర్శ్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 25 వసంతాలు పూర్తి చేసుకుంటున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభను కార్యకర్తలు నాయకులు అభిమానులు పెద్ద ఎత్తున తరలివెళ్లి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలు విసుగుచెందారని ఎద్దేవా చేశారు. మళ్లీ కేసీఆర్ వస్తేనే తెలంగాణ అభివృద్ధిలో దూసుకుపోతుందని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలను కాపాడుకుంటామని తగిన గుర్తింపునిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ బాల్‌రెడ్డి, యువత నాయకులు వెంకటేశం గౌడ్ పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడిని పరిష్కరించండి



బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

పుల్‌కల్(అందోల్): మండల కేంద్రం పుల్‌కల్‌లో తాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మహిళలు శనివారం రోడ్డుపై ఖాళీ బిందెలతో నిరసనకు దిగారు. పుల్‌కల్‌లో మిషన్ భగీరథ నీరు సక్రమంగా సరఫరా కావడం లేదని.. స్థానికంగా ఉన్న బోరు నీళ్లు కూడా రావడం లేదని వా పోయారు. అధికారులకు ఎన్ని విజ్ఞప్తులు చేసినా స్పందించడం లేదని మహిళలు మండిపడ్డారు.

స్థలదాతలకు సన్మానం

కల్హేర్(నారాయణఖేడ్): నిజాంపేట్ మండలం బాచేపల్లిలో రాంమందిరం కోసం ఉచితంగా స్థలం అందజేసిన దాతలను శనివారం గ్రామస్తులు సన్మానం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు పద్మ, మల్లేశం, మాజీ రైతు సమితి అధ్యక్షుడు దుర్గారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్‌గౌడ్, మాజీ సర్పంచ్ సంగయ్య, గ్రామ ప్రముఖులు కాల్వ అంజిరెడ్డి, ఏసురెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.

పేకాటరాయుళ్లపై కేసు

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ మండలం గోసాయిపల్లిలో పేకాట స్థావరాలపై శనివారం పోలీసులు దాడి చేసి 9 మందిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. చాకలి శ్రీనివాస్ ఇంటి ఎదుట పేకాట ఆడుతున్నారని సమాచారం అందడంతో దాడి చేసి రూ.10,100 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఎవరైనా పేకాట ఆడితే సమాచారం అందించాలని కోరారు. కరుణాకర్, ధనరాజ్, సాయికిరణ్, విష్ణు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు సరికాదు

నారాయణఖేడ్: ప్రధాని నరేంద్రమోదీపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ వ్యాఖ్యలు సరికాదని మండల బీజేపీ అధ్యక్షుడు దశరథ్ కురుమ మండిపడ్డారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ వెంటనే ఆయనను బర్తరఫ్ చేసి పార్టీ నుంచి సస్పెండ్ చేయాలన్నారు. ఎవరైనా ప్రధాని మోదీపై, బీజేపీపై ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే సహించబోమన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

జహీరాబాద్ టౌన్: అగ్ని ప్రమాదాల నివారణపై విద్యార్థులకు ఫైర్‌స్టేషన్ సిబ్బంది శనివారం అవగాహన కల్పించారు. అగ్నిమాపక శాఖ వారోత్సవాల (ఫైర్ సర్వీసెస్ వీక్)లో భాగంగా స్థానిక అగ్నిమాపక కేంద్రంలో ప్రమాదాల నివారణపై మాక్ డ్రిల్ చేసి చూపించారు. ఈ సందర్భంగా ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఫైర్‌స్టేషన్ ఇన్‌చార్జి అధికారి శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మునిపల్లి(అందోల్): పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్ఐ రాజేశ్‌నాయక్ కథనం ప్రకారం మండలంలోని మక్తక్యాసారం గ్రామానికి చెందిన పట్లోళ్ల మల్లేశం (55) శనివారం ఒక ఫాంహౌస్‌లో పురుగుల మందు తాగి కడుపు మంట భరించలేక అరవ సాగాడు. గమనించిన చుట్టు పక్కల రైతులు 108 వాహనంలో సంగారెడ్డి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు.

22 నుంచి భూలక్ష్మి, నాగదేవత జాతర

నారాయణఖేడ్: మండలం పరిధి రుద్రారంలో 22 నుంచి 24 వరకు భూలక్ష్మి, నాగదేవత ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆలయ 37వ వార్షికోత్సవాన్ని సైతం నిర్వహించనున్నట్లు చెప్పారు. జాతర ఉత్సవాల్లో భాగంగా 22న బోనాలు, 23న బండ్ల ప్రదక్షణ, 24న ముగింపు బండ్ల ప్రదక్షణలు జరుగుతాయని వివరించారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

వైభవంగా సిద్ధేశ్వరుడి రథోత్సవం

కంగ్టి(నారాయణఖేడ్): ఊరంతా హరహర మహాదేవ నినాదాలతో మార్మోగింది. కంగ్టి శివారులోని సిద్ధేశ్వర ఆలయ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామం నుంచి భక్తులు మహాదేవుడిని స్మరిస్తూ రథం లాగుతూ శివారులోని ఆలయం వరకు ఊరేగించారు. అనంతరం భక్తులు మొక్కులు చెల్లించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాలు ఐదు రోజులు కొనసాగనున్నాయి. శనివారం కుస్తీపోటీలు జరిగాయి. ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి రూ. 6000 విలువ గల వెండి కడియం బహూకరించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఏసుక్రీస్తు బోధనలు ఆచరణీయం

ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి



రన్‌ఫర్ జీసస్ ర్యాలీని ప్రారంభించిన ఎమ్మెల్యే

పటాన్‌చెరు: ఏసుక్రీస్తు బోధనలు సమానత్వానికి దోహదం చేశాయని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి తెలిపారు. గుడ్ ఫ్రైడే పురస్కరించుకొని శనివారం పట్టణంలోని మైత్రి మైదానంలో ఏర్పాటు చేసిన రన్ ఫర్ జీసస్ బైక్ ర్యాలీని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరిపై ప్రేమ, అనురాగం ఆప్యాయతో మెలగాలని క్రీస్తు తన బోధనల ద్వారా విశ్వవ్యాప్తంగా ప్రచారం చేశారని పేర్కొన్నారు. నియోజకవర్గంలో నూతన చర్చిల నిర్మాణానికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని చెప్పారు. సమావేశంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, పృథ్వీరాజ్, జీవన్, నరేష్, వివిధ క్రిస్టియన్ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

రేపటి నుంచి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

రాయికోడ్ (అందోల్): మండలంలోని యూసుఫ్‌పూర్‌లో సోమవారం నుంచి మూడు రోజుల పాటు భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి, నంది, గణపతి, సుబ్రమణ్య స్వామి, శిఖర ప్రతిష్ఠ వేడుకలు నిర్వహించనున్నట్లు పట్లోళ్ల సంగారెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 21న అఖండ దీపారాధన, గోపూజ, గణపతి పూజ, స్వస్తి పుణ్యహవాచనం, అంకురార్పణం, రుత్వికరణం, నాంది సమారాధన, పంచగవ్య ప్రాసన ప్రధాన కలశ స్థాపన, మంటపారాధన, అగ్ని ప్రతిష్ఠ, మహా మంగళ హారతి పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. కార్యక్రమానికి బీచ్ కుందకు ఆశ్రమానికి చెందిన సోమలింగ శివాచార్యస్వామి, ధనసిరి ఆశ్రమ వీరేశ్వర శివచార్య స్వామిజీ, సద్గురు బండయప్ప స్వామిలు ముఖ్యఅతిథిగా విచ్చేస్తారని, భక్తులు అధిక సంఖ్యలో రావాలని కోరారు.

అంగన్‌వాడీలో ప్రీ స్కూల్

సీడీపీఓ ప్రియాంక



మాట్లాడుతున్న సీడీపీఓ ప్రియాంక

హత్నూర(సంగారెడ్డి): అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్ విద్యాబోధన, పౌష్టికాహారం అందిస్తున్నామని సీడీపీఓ ప్రియాంక అన్నారు. శనివారం మండలంలోని తహర్‌ఖాన్ పేట అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రంలో ఆటాపాటలతో పాటు ప్రీ స్కూల్ విద్య సాగుతోందని చెప్పారు. విద్యార్థులను ప్రైమరీ పాఠశాలలో చేర్పించేందుకు అంగన్‌వాడీ సెంటర్లు ఎంతగానో కృషి చేస్తున్నాయని తెలిపారు. చిన్నారులు, గర్భిణీ, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సంధ్యారాణి మండలంలోని ఆయా గ్రామాల అంగన్‌వాడీ టీచర్లు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయండి

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు యెన్నం అనిల్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని బీబీపేట్‌లో రైతులు ఆరబెట్టిన జొన్నలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో ఎక్కడ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకుండా రైతులపై కక్ష సాధింపు చర్యలకు కాంగ్రెస్ ప్రభుత్వం పాల్పడుతుందని ఆరోపించారు. జొన్నలు తక్కువగా ఉన్న చోట కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి జొన్నలు ఎక్కువగా సాగైన గ్రామాలను విస్మరించడం తగదన్నారు. వేరే కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్లాంటే రైతులకు రవాణా ఖర్చులు, సమయం వృథా అవుతాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులకు రైతులపై ప్రేముంటే బీబీపేట్ కేంద్రంగా జొన్నల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి మండలంలోని మిగతా గ్రామాల్లో ఉప కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. లేకపోతే రైతులతో కలిసి ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, నవీన్, రాజు, సంతోష్, రైతులు రాజారాంగౌడ్, రాజు పాల్గొన్నారు.

వరద కాలువ పరిశీలన



కాలువను పరిశీలిస్తున్న అధికారులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ఈదుల నాగులపల్లి రేడియల్ రోడ్డు అండర్‌పాస్‌ను శనివారం ఆయా శాఖల అధికారులు పరిశీలించారు. శుక్రవారం కురిసిన వర్షానికి అండర్‌పాస్‌లో వర్షపు నీరు నిల్వడంతో ఇరిగేషన్ ఈఈ బీమ్, మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, ఆర్ అండ్‌బి ఏఈ అజయ్, ఆర్ఐ శ్రీకాంత్‌లు సందర్శించారు. అక్కడే ఉన్న వరద కాలువను వారు పరిశీలించారు. దానిని పునరుద్ధరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

కొనుగోలు కేంద్రాలతో ప్రయోజనం

ఎమ్మెల్యే సంజీవరెడ్డి



జొన్నల కొనుగోలు కేంద్రం మనూరులో ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: నిజమైన అర్హులకే ఇందిరమ్మ ఇళ్లను కేటాయించడం జరుగుతుందని ఎమ్మెల్యే సంజీవరెడ్డి స్పష్టం చేశారు. నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో పైలట్ ప్రాజెక్టు కింద ఎంపికైన గ్రామాల్లో బేస్‌మెంట్ నిర్మాణాలు పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు బిల్లులకు సంబంధించి ఎఫ్‌టీవోలను శనివారం ఖేడ్ క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. అంతకుముందు మహిళా, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణ్ పక్వాడా కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం మనూరు మండల కేంద్రంలో మనూరు, నాగల్‌గిద్ద మండలాలకు సంబంధించి పీఏసీఎస్ ఆధ్వర్యంలో మనూరులో ఏర్పాటు చేసిన జొన్న కొనుగోలు కేంద్రంతోపాటు ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆటలపోటీల శిక్షణ, నవోదయ ప్రవేశ పరీక్ష శిక్షణ కార్యక్రమాలను కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...పేదలు ఈ పథకం ద్వారా తమ సొంతింటి కలను సాకారం చేసుకోవాలన్నారు. నియోజకవర్గంలోని వివిధ మండలాల్లోని గ్రామాలకు చెందిన 150 మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. రైతులు తమ పంట ఉత్పత్తులను మద్దతు ధరకు విక్రయించుకుని లబ్ధి పొందేందుకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జొన్నలకు ప్రభుత్వం రూ.3,371ల మద్దతు ధరకు కొనుగోలు చేయనున్నట్లు వెల్లడించారు. వివక్ష చూపకుండా తల్లిదండ్రులు ఆడపిల్లలను సైతం కనీసం డిగ్రీవరకు చదివించాలని సంజీవరెడ్డి పేర్కొన్నారు. జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారిణి లలిత కుమారి మాట్లాడుతూ కిశోర బాలికలు, గర్భిణులు, బాలింతలు, పిల్లలు తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీపీవో సాయిబాబా, సీడీపీఓ సుజాత, ఆయా మండలాల ఎంపీడీవోలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పసల్వాదిలో ఇందిరమ్మకమిటీ సమావేశం

సంగారెడ్డి టౌన్ : అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని ఎంపీడీఓ యాదగిరి అన్నారు. శనివారం మండలంలోని పసల్వాదితో పాటు పలు గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అవుతాయని ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదన్నారు.